క్లుప్తంగా

మద్ది క్షేత్రానికి యాత్ర



మద్ది ఆంజనేయస్వామి క్షేత్రానికి మోటార్‌సైకిళ్లపై ర్యాలీగా వెళ్తున్న భక్తులు

కొయ్యలగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీమద్ది ఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు కొయ్యలగూడెం మీదుగా మోటార్ బైకులపై సోమవారం తరలివెళ్లారు. తూర్పుగోదావరి జిల్లా కడిపిలంకకు చెందిన 152 మంది భక్తులు గురుస్వామి పల్లం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం మీదుగా తరలి వెళ్తున్న భక్తులకు గ్రామస్తులు ఆహ్వానం పలికి అనంతరం వీడ్కోలు తెలిపారు. కడిపిలంకలో ఆంజనేయ స్వామి ఆలయ 73వ వార్షికోత్సవ సందర్భంగా మొదటిసారిగా తామంతా మద్ది క్షేత్రానికి యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. రామనామ, హనుమాన్ శరణు ఘోష నిర్వహిస్తూ రాలి నిర్వహించారు.

ఛత్రపతి జయంతి



ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : స్థానిక సీఎస్‌టీఎస్ కళాశాలలో ఛత్రపతి శివాజీ జయంతి సోమవారం నిర్వహించారు. కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ యు.వెంకటాచార్యులు అధ్యక్షతన కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ఆవరణలో ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వెంకటాచార్యులు మాట్లాడుతూ శివాజీ ఖ్యాతిని, గొప్పతనాన్ని, అతను నడిచినటువంటి మార్గాన్ని, క్రమశిక్షణను విద్యార్థులకు వివరించారు. కళాశాల పేరును విద్యార్థులు నిలబెట్టాలన్నారు.

అన్నసమారాధన



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నసమారాధన

టి.నరసాపురం: ఐదు రోజులుగా మండలంలో నిర్వహిస్తున్న శివరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. టి.నరసాపురం కాశీ విశ్వేశ్వర ఆలయం వద్ద చైర్మన్ కమ్మిల రమేష్‌రాజు ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. మక్కినవారిగూడెం భువనేశ్వరి సమేత చంద్రశేఖర స్వామి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన జరిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివదేవుని గ్రామోత్సవం



రుద్రాక్ష మండప వాహనంలో ఊరేగుతున్న శివయ్య

ద్వారకాతిరుమల : క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఉదయం తీర్థపు బిందె, నిత్యహోమం, బలిహరణ, గణపతిపూజ అనంతరం స్వామివారికి అభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చనను నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ఆవరణలో శివయ్యకు త్రిశూలస్నానాన్ని అట్టహాసంగా జరిపారు. అనంతరం రుద్రాక్ష మండప వాహనంలో గంగా, పార్వతీ సమేత శివదేవుని గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి వసంతోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. రాత్రి ఆలయంలో స్వామివారికి 21 చుట్లు పల్లకీ సేవ నిర్వహించారు.

రైల్వే స్టేషన్లలో తనిఖీలు



పార్శిల్స్‌ను తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

ఏలూరు టౌన్: రైల్వే స్టేషన్లల్లో గంజాయి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ రైల్వే ఎస్పీ విశాల్‌గున్ని ఆదేశాలతో సోమవారం జిల్లాలోని అన్ని రైల్వేస్టేషన్లల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఏలూరు రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారం, రైళ్లలో తనిఖీ చేశామని ఏఎస్సై సైమన్ తెలిపారు. అనుమానాస్పద పార్శిల్స్ తనిఖీ చేసిన తరువాతే ఆటోల్లో తీసుకెళ్లాలని ఆటో యూనియన్ నాయకులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో రైల్వే పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో నీటిఎద్దడి రానివ్వద్దు

అధికారులను ఆదేశించిన మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, చిత్రంలో కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తదితరులు

జంగారెడ్డిగూడెం : వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వాటర్ వర్కర్లు, సచివాలయ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ పట్టణ నీటి అవసరాలను ముందుగానే గుర్తించి, వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఏయే ప్రాంతాల్లో నీటి సమస్య ఏర్పడవచ్చు, ఎక్కడెక్కడ నీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయి తదితర విషయాలను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించాలన్నారు. వాటర్ వర్కర్లకు తాగునీటి సమస్యపై ముందుగానే కొంత అవగాహన ఉంటుందని, వారి అభిప్రాయాలు, సూచనలు సచివాలయ సెక్రటరీలకు తెలియజేసి తాగునీటి ఎద్దడి రాకుండా చేపట్టే చర్యల్లో భాగస్వాములు కావాలన్నారు. కమిషనర్ పి.భవానీ ప్రసాద్ మాట్లాడుతూ ఎక్కడెక్కడ ప్రధాన వాటర్ పైప్‌లైన్స్ ఉన్నాయి, వాటిలో సమస్యలు ఏమి ఉన్నాయి, వాల్వ్ ఏర్పాటు, నూతన పైప్‌లైన్ ఏర్పాటు వంటి అవసరాలు ఉన్నాయా, ఏఏ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఏర్పడవచ్చు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సిబ్బంది అధికారులకు తెలియజేయాలన్నారు. వేసవికాలంలో ప్రజలు నీళ్ల లేక ఇబ్బంది పడకూడదని, నిర్విరామంగా ప్రజలకు నీటి సదుపాయం కల్పించాలన్నారు. అలాగే ప్రైవేట్ ఫంక్షన్లకు ప్రభుత్వ వాటర్ ట్యాంకులు సప్లయి చేయకూడదని, అనుమతి లేకుండా చేసినచో చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సంధ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాగుకు పగటిపూట విద్యుత్ ఇవ్వండి

విద్యుత్ అధికారులకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విజ్ఞప్తి



ఫోన్‌లో అధికారులతో మాట్లాడుతున్న బాలరాజు

బుట్టాయగూడెం : రైతులకు వ్యవసాయానికి ఇబ్బంది కలుగకుండా పగటిపూట విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. సోమవారం ఆయన విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ రబీ సీజన్‌లో అనేక మంది రైతులు వివిధ రకాల పంటలు వేశారని అన్నారు. ముఖ్యంగా వర్జీనియా పొగాకు పంటను ఎక్కువగా వేయడం జరిగిందని అన్నారు. పొగాకు తర్వాత మిరప, మొక్కజొన్న, వేరుశనగ పంటలు కూడా రైతులు అధికంగా వేశారని అన్నారు. ముమ్మరంగా పనులు జరుగుతున్న సమయంలో విద్యుత్ కోతల వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని, పగటి పూట కరెంట్‌ను ఇవ్వడం వల్ల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రస్తుతం పంటలు చేతికి వచ్చిన సమయంలో కరెంట్ సక్రమంగా ఇవ్వకపోవడం వల్ల పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అనుకూలంగా పగటిపూట కరెంట్ ఇచ్చే విధంగా విద్యుత్‌శాఖ అధికారులు కృషి చేయాలని కోరారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో వైద్యం పొందుతూ డిశ్చార్జ్ అయిన కేఆర్‌పురం ఎంపీటీసీ గాలి దుర్గారావుని ఫోన్‌లో పరామర్శించి ఆరోగ్య స్థితిపై అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బరిలో దిగనున్న పశ్చిమగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్‌లను ఈ సందర్భంగా బాలరాజు అభినందించారు.

బీసీల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ కృషి



పార్టీ కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ శ్రీధర్

లింగపాలెం : బీసీల అభ్యున్నతికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేస్తోందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్ద పీట వేస్తున్నారని, దీంతో అనేక మంది బీసీ నాయకులు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ఆయన చెప్పారు. ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన బీసీ నాయకుడు మాయ సత్యన్నారాయణ బీజేపీకి రాజీనామా చేసి సోమవారం ఎంపీ శ్రీధర్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు ఎంపీ శ్రీధర్ సత్యన్నారాయణకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎంపీ పరామర్శ

ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుడు భూపతి పుల్లయ్య సోదరుడు కనకయ్య ఇటీవల మృతిచెందాడు. అలాగే గ్రామానికి చెందిన గారపాటి రాంబాబు తల్లి కృష్ణవేణి ఇటీవల మృతి చెందారు. ఈ రెండు కుటుంబాలను సోమవారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పరామర్శించి సానుభూతి తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీతోపాటు రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహనరావు, ధర్మాజీగూడెం, రంగాపురం సొసైటీల చైర్‌పర్సన్లు ఉప్పలపాటి వరప్రసాద్, ముళ్లంగి లోకనాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఇనుగంటి రాజేష్‌బాబు, ఇనుగంటి సతీష్, మేకల రాజు, సొంగా సందీప్, బి ప్రభాకరెడ్డి, ముళ్లపూడి సుమన్, తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్



పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ బాలసురేష్‌బాబు

జంగారెడ్డిగూడెం : గంజాయి, మత్తు పదార్థాలు రవాణా, అమ్మకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బాల సురేష్‌బాబు హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం గంజాయి, మత్తుపదార్థాల రవాణా, అమ్మకాలకు సంబంధించి పాత నేరస్తులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి చేటు చేసే ఎటువంటి కార్యక్రమం అయిన చట్టరీత్యా నేరమన్నారు. ముఖ్యంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అమ్మకాలు, వాటిని రవాణా చేయడం తీవ్ర నేరంగా పరిగణించడం జరుగుతుందన్నారు. మాదక ద్రవ్యాలు రవాణా, అమ్మకం నేరమని, దీనికి కఠినమైన శిక్షలు విధించడం జరుగుతుందన్నారు. మత్తుపదార్థాలు, గంజాయి వల్ల వ్యక్తి తన ఆరోగ్యాన్ని నాశనం చేసుకోవడంతోపాటు వారిని నమ్ముకున్న కుటుంబం సైతం ఇబ్బందులు పడుతుందన్నారు. కావున సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సీఐ సూచించారు. కార్యక్రమంలో క్రైమ్ పార్టీ ఏఎస్సై ఎస్‌వీ సంపత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టానికి అందరూ సమానమే



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే ఇబ్రహీం షరీఫ్

చింతలపూడి : కుల, మత, పేద, ధనిక తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ సమానమన్న భావనే సామాజిక న్యాయం ముఖ్య ఉద్దేశమని జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే ఇబ్రహీం షరీఫ్ అన్నారు. సోషల్ జస్టిస్ డేను పురస్కరించుకుని స్థానికంగా పాఠశాలలో సోమవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, బాధ్యతల నుంచి సామాజిక న్యాయం వచ్చిందని అన్నారు. బాల్యం నుంచే పిల్లలు అందరూ సమానమనే భావనను కలిగి ఉండాలని చెప్పారు. చట్టం అందరికీ ఒక్కటేనని, చట్టానికి ధనిక, పేద తారతమ్యాలు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పింగుల డేవిడ్ రాజు, పట్నాల శ్రీనివాసరావు, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి, ప్రిన్సిపాల్ కె.సత్యన్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి విలువ తగ్గింపుపై ఆందోళన



వేలేరుపాడు ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభను అడ్డుకుంటున్న గ్రామస్తులు

వేలేరుపాడు : పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ఇంటి విలువలు (స్ట్రక్చర్ వాల్యూస్) తగ్గించడంపై నిర్వాసితులు గగ్గోలు పెడుతున్నారు. తమ ఇంటి విలువలు చాలా తక్కువగా వచ్చాయంటూ వేలేరుపాడు మండల కేంద్ర నిర్వాసితులు గ్రామసభను సోమవారం బహిష్కరించారు. రేపాకగొమ్ము గ్రామ పంచాయతీ పరిధిలోని వేలేరుపాడు గ్రామ పంచాయతీ సచివాలయంలో గ్రామసభ నిర్వహించేందుకు వచ్చిన అధికారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. అనంతరం గ్రామసభను బహిష్కరిస్తున్నట్లు తీర్మానం చేశారు. గతంలో అనేక సార్లు ఇంటి విలువలు ప్రకటించారని, 2019 డిసెంబర్ 26న గ్రామ సభలు నిర్వహించి అధికారికంగా ప్రకటించి, నిర్వాసితుల సంతకాలు తీసుకున్నారని, మరలా నాలుగేళ్ల తర్వాత ఇంటి విలువల్లో భారీగా కోతలు విధించి గ్రామసభలు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. నిర్వాసితుల జీవితాలతో కొందరు అధికారులు ఆటలాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019వ సంవత్సరంలో ఒక్క వేలేరుపాడులో 632 ఇండ్లకుగాను రూ.27 కోట్ల 24 లక్షల ఇంటి విలువల పరిహారం ఉంది. ప్రస్తుతం రూ.13 కోట్ల, 15 లక్షల, 86 వేలకు తగ్గిందని, అంటే రూ.14 కోట్ల వ్యత్యాసం వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. 2019వ సంవత్సరంలో గ్రామ సభల్లో ప్రకటించిన ఇంటి విలువలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అనంతరం సమస్య పరిష్కరించాలని కోరుతూ పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్యాకు ఎంపీపీ వల్లా లక్ష్మీదేవి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, వైస్ ఎంపీపీ కేసగాని వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ సోయం వెంకమ్మ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, గుద్దేటి భాస్కర్, మెండెం కుమార్, కురిమెళ్ళ రమేష్, శాఖమూరి సంజీవులు, పోలవరం యూనిట్ 2 కార్యాలయ సిబ్బంది షరీఫ్, సౌజన్యారాణి, వైఎస్సార్ సీపీ యూత్ నాయకులు బద్దె ప్రేమ్‌కుమార్, నర్సింహారావు, గిల్లా వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామాజిక అసమానతలను రూపుమాపాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది శ్రీనివాసరావు

బుట్టాయగూడెం : అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ఉన్న సామాజిక అసమానతలను రూపుమాపడంలో న్యాయ వ్యవస్థ పాత్ర కీలకమని విద్యార్థులకు వివరించారు. ఈ సమావేశంలో న్యాయవాదులు అచ్యుత శ్రీనివాసరావు, ఉద్దండం ఏసుబాబు, పిల్లి పెద్దిరాజు, ఏవీవీ భువనేశ్వరి, వింజమూరి కిషోర్, ఉస్సే శివశంకర్, టి.రాము, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహేంద్రరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ హనుమాన్, లెక్చరర్ మంత్రి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. వీరేశ్వరస్వామి కల్యాణం



వీరేశ్వరస్వామి కల్యాణం నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాడువాయి శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి కల్యాణాన్ని సోమవారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమార్ శర్మ, అర్చకులు స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వీక్షించి తరించారు. అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 21న అపర్ణాసమేత అనంతేశ్వర స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పాపోలు వెంకటేశ్వరరావు తెలిపారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి స్వామి వారిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీటీసీ సత్రం లక్ష్మణరావు, కనికళ్ల ప్రసాద్, పల్లా గంగాధరరావు, ఓరుగంటి నాగేంద్ర, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్పందనలో 14 అర్జీలు

జంగారెడ్డిగూడెం : స్పందన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో మొత్తం 14 అర్జీలు వచ్చాయని. వీటిలో ఎక్కువగా భూసంబంధిత సమస్యలు ఉన్నాయన్నారు. అర్జీలను సంబంధిత అధికారులకు ఎండార్స్‌చేశామని ఆమె తెలిపారు.

రేపు శిక్షణ తరగతులు

జంగారెడ్డిగూడెం రూరల్ : స్థానిక ఆలపాటి గంగాభవానీ కల్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు తెలిపారు. ఎమ్మెల్యే ఎలీజా ఈ కార్యక్రమానికి హాజరవుతారని, మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొనాలని కోరారు.

మేదర సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గం ఎన్నిక



సంఘ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న కమిటీ బృందం

కొయ్యలగూడెం : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను మేదర వర్గానికి చెందిన అందరికీ అందేలా మండల మేదర కుల సంక్షేమ సంఘం కృషి చేయాలని ఆ సంఘం నూతన అధ్యక్షుడు సిరిగిరి మంగారావు పేర్కొన్నారు. సోమవారం గవరవరం గ్రామంలో మండల మేదరకుల సంఘ సమావేశం పెద్దల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంగారావు, గౌరవ అధ్యక్షుడిగా పాతకోట మోషే, ప్రధాన కార్యదర్శిగా పాతకోట విజయ, కోశాధికారిగా పాతకోట వీరబాబు, ప్రచార కార్యదర్శిగా పాతకోట కిషోర్, సభ్యులుగా సిరిగిరి వెంకటేశ్వరరావు, పి.సూర్యప్రకాష్, ఎన్న రామకృష్ణ, కె.కుమారస్వామి, పీబీ కిషోర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంచే సంఘ పెద్దలు ప్రమాణ స్వీకారం చేయించారు.

కలుషిత జలాలు తాగి పాడి గేదె మృతి

జంగారెడ్డిగూడెం : కలుషిత జలాలు తాగి ఓ పాడి గేదె మృతి చెందింది. బాధిత రైతు కొండపల్లి భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద నివాసం ఉంటున్నానని, తనకు నాలుగు గేదెలు ఉన్నాయన్నారు. గత మూడు రోజుల నుంచి గేదె నలతగా ఉండటంతో పశువైద్యునికి చూపించానని, తాగునీరు తేడాలని చెప్పారు. గేదెలు మేతకు వెళ్లిన సమయంలో సమీపంలోని నీటిని తాగేవని, అయితే ఈ నీరు పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాలతో కలుషితమైందన్నారు. సోమవారం గేదె ముక్కుల నుంచి రక్తం కారుతూ, నోటి నుంచి నురగలు కక్కుతూ మృతిచెందిందన్నారు. గతంలో కూడా ఇలానే ఒక పాడి గేదె మృతిచెందిందన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ విడుదల చేసిన వ్యర్థాలతో నీరు కలుషితమవుతోందని, తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

టైలర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం



టైలర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని గణేశ్వరరావు టౌన్ హాల్లో శ్రీ వెంకటేశ్వర నవ్యాంధ్ర ఏలూరు జిల్లా టైలర్ల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూసా బాలభాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా సాధనాల సర్వేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా జీడికంటి రామారావు లక్ష్మి, వెంకటరమణ, యు.కృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎన్.సత్యనారాయణ, సభ్యులుగా షేక్ నల్లార్, షేక్ మహెబూబ్, నాగ ప్రసాద్, రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టైలర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

జీవశాస్త్ర మెటీరియల్ విడుదల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి జీవశాస్త్ర మెటీరియల్‌ను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ రవిసాగర్ విడుదల చేశారు. నగరంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన వేదికపై ఈ మెటీరియల్‌ను సంఘ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రవి సాగర్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా జీవశాస్త్ర మెటీరియల్ ముద్రించడం అభినందనీయమని, ఈ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కూడా ఆయన విడుదల చేశారు. ఫోరం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ఓవీ ధనుంజయ రావు, ప్రధాన కార్యదర్శి జి.గంగాధర రావు, గౌరవ సలహాదారు ఐ.భాస్కర కుమార్, ఎంఈఓ సబ్బితి నరసింహమూర్తి పాల్గొన్నారు.

వారిని అనర్హులుగా ప్రకటించాలి

ఏలూరు (టూటౌన్): విద్యుత్ సంస్థల స్పాట్ బిల్లింగ్ టెండర్లలో కంపెనీ నిబంధనలు ఉల్లంఘించిన కాంట్రాక్టర్లను అనర్హులుగా ప్రకటించాలని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు డీఎన్‌వీడీ ప్రసాద్ కోరారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కేఎన్ మల్లేశ్వరరావు అధ్యక్షతన సోమవారం యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మీటర్ రీడర్ల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. జిల్లాలోని పలు సబ్ డివిజన్లలో స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టర్లు మీటర్ రీడర్లపై వేధింపులకు పాల్పడుతున్నారని, సంస్థలు నిర్దేశించిన రేట్లు ఇవ్వకుండా దోచుకుంటున్నారని విమర్శించారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సక్రమంగా కట్టకుండా కార్మికులకు ద్రోహం చేస్తున్నారని తెలిపారు. మీటర్ రీడింగుల్ని 11 రోజుల్లోనే పూర్తి చేయాలని అధికారుల ఆదేశాలు ఇవ్వడం అన్యాయమని, మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రాకపోకలకు మార్గం సుగమం

ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

జంగారెడ్డిగూడెం : స్థానిక ప్రతిభ స్కూల్, వాసవీ కళ్యాణ మండానికి వెళ్లే జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన డివైడర్ కటింగ్‌ను మూసివేందుకు మున్సిపల్ అధికారులు నిర్ణయించగా, ప్రజల అభ్యర్థన మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు స్పందించి ఆయా శాఖల అధికారులతో మాట్లాడి డివైడర్ కటింగ్‌ను తెరిపించారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ప్రతిభ స్కూల్, వాసవీ కళ్యాణ మండానికి వెళ్లే జంక్షన్ వద్ద డివైడర్ కటింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఇటు కళ్యాణ మండపం వైపు వెళ్లే ప్రజలు దూరంగా వెళ్లి మలుపు తిరగాల్సి వచ్చేది. దీంతో సమయం వృథా కావడంతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడేవి. దీంతో ప్రజల అభ్యర్థన మేరకు కటింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే సోమవారం అనధికారికంగా ఏర్పాటు చేసిన డివైడర్ కటింగ్‌లను మూసివేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ప్రధాన జంక్షన్‌లోని కటింగ్‌ను కూడా మూసివేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటుండగా, ప్రజలు జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ, సొసైటీ అధ్యక్షులు వందనపు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బత్తిన చిన్న దృష్టికి తీసుకువెళ్లారు .దీంతో వారు స్పందించి డివైడర్ కటింగ్‌ను మూసివేయకుండా చర్యలు తీసుకున్నారు. విషయాన్ని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన కూడా సానుకూలంగా స్పందించారన్నారు. తమ అభ్యర్థనను మన్నించిన ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, నాయకులకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.